ఆరోగ్యానికి అభయం



రామారావుపేట యూపీహెచ్‌సీలో సేవలందిస్తున్న డాక్టర్ నిరీక్షణ



కాకినాడ రామారావుపేటలో అర్బన్ హెల్త్ సెంటర్

- అందివచ్చిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు
- అదనంగా ఐదు కేంద్రాల ఏర్పాటు
- నగర ప్రజలకు మెరుగైన సేవలు

కాకినాడ క్రైం: సుస్తీ చేస్తే పెద్దాసుపత్రికే పరుగులెట్టే రోజులు పోయాయి.. వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.. ఈ రంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో ఆరోగ్యానికి అభయం వచ్చింది.. నగరంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లతో వందలాది మంది రోగులకు సాంత్వన కలుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగర వైద్య సేవల దశ దిశ సమూలంగా మారిపోయింది. స్థానిక వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చి రోగులకు ప్రయాస లేని వైద్యాన్ని సుస్థిరం చేసింది. కాకినాడలో ఎనిమిది అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉండగా.. అదనంగా మేరో ఐదు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో కేంద్రాన్ని ఒక్కో పెద్దాసుపత్రి స్థాయిలో తీర్చిదిద్దారు. కనీసం పది మంది రోగులైనా కానరాని గత నిర్లక్ష్యాన్ని చెరిపేస్తూ ఇప్పుడు ప్రజలకు చక్కనైన వైద్యాన్ని అందిస్తూ ఓపీ సంఖ్యను గణనీయంగా పెంచారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ రోజూ కనీసం 100–120 మధ్య ఓపీ ఉంటోంది.

172 రకాల మందులు.. 60 పరీక్షలు

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో 172 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఇందులో అత్యవసర మందుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులకు సైతం మందులు లభ్యమవుతాయి. 60 రకాల వైద్య ఆరోగ్య పరీక్షలు అర్బన్ హెల్త్ సెంటర్లలో చేస్తున్నారు. ఇందులో సాధారణ పరీక్షలతో పాటు గర్భిణులకు నిర్వహించే కీలక పరీక్షలు సైతం ఉంటాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రాల అన్నింట్లో స్పెషాలిటీ వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. వారినికి ఒకరోజు చొప్పున గైనిక్, పీడియాట్రిక్, సర్జరీ, ఆర్థో వైద్యులు అందుబాటులో ఉంటారు. అలాగే గర్భిణులకు ప్రత్యేక క్యాంప్‌ల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో స్పెషాలిటీ వైద్యుల అవసరం ఉంటే అక్కడున్న వైద్యాధికారి టెలీ మెడిసిన్ ద్వారా స్పెషలిస్టును సంప్రదించి తగిన సూచనల మేరకు వైద్యం అందిస్తున్నారు.

జీజీహెచ్ సేవల్లో నాణ్యత

స్థానిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, వాటి సేవల పట్ల రోగులు సంతృప్తి చెందుతున్నారు. దీంతో కాకినాడ జీజీహెచ్‌లో ఓపీ సంఖ్య తగ్గింది. గతంలో ఒకరోజు ఓపీ 2,800కు పైనే ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య 2,200కు లోపే ఉంటోంది. ఇదిలాఉంటే జీజీహెచ్‌లో క్యాథ్ ల్యాబ్, ఎంసీహెచ్ బ్లాక్, దిశ వన్ స్టాప్ సెంటర్‌లు నిర్మిస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జీజీహెచ్ విస్తరణకు ప్రభుత్వం పూనుకుంది. ఆర్ఎంసీ, ఐటీఐలలో జీజీహెచ్‌కు సంబంధించిన ప్రత్యేక నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కొత్త నిర్మాణాల్లో ఎంసీహెచ్ బ్లాక్‌కు రూ.52 కోట్లు ఖర్చు అవుతుండగా, రూ.1.22 కోట్లతో నిర్మితమైన ప్రతాప్‌నగర్ యూపీహెచ్‌సీ, ఆర్ఎంసీ బాలుర వసతి గృహ నిర్మాణ పనులను ఈ ఏడాది ఏప్రిల్ 24న మంత్రి రజని ప్రారంభించారు.

వైద్య సేవలు బలోపేతం



ప్రభుత్వం చొరవతో వైద్య సేవలు బలోపేతం అయ్యాయి. నేడు ప్రభుత్వ సేవల్లో అందని వైద్యం లేదు. కీలకమైన అన్ని విభాగాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది నియామకాలు త్వరితగతిన జరుగుతున్నాయి. ఇటీవల ప్రవేశపెట్టిన ఈవెనింగ్ క్లీనిక్‌లు విజయవంతమయ్యాయి. ఆరోగ్యశ్రీలో సుమారు 3,500 రోగాలకు చికిత్స లభిస్తోంది.

– డాక్టర్ హేమలతాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఆరోగ్యశ్రీ ప్రాణాలు నిలిపింది



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నా ప్రాణాలను నిలిపింది. శరీరంలో కుడివైపు గుండె ఉన్న నాకు గుండె పోటుతో స్టంట్లు వేయాల్సి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా ఆరోగ్యశ్రీ వల్ల కార్పొరేట్ వైద్యం పొందాను. కాకినాడలోని ఓ ఎమర్జెన్సీ ఆసుపత్రిలో కీలక శస్త్రచికిత్సను పూర్తి ఉచితంగా నిర్వహించారు. కొద్ది రోజుల్లోనే కోలుకొని సాధారణ జీవితం గడుపుతున్నాను.

– గుత్తుల శ్రీనివాసరావు, బాధితుడు

గతంలో ఈ సౌకర్యాలు లేవు



కొన్నేళ్లుగా ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడి ఉన్నాం. గతంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యం అంటే ఎంతో ప్రయాస పడేవాళ్లం. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ వైద్య సేవలు సౌకర్యవంతంగా మారాయి. కొద్ది రోజుల కిందట కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో సోదరికి ప్రసవం చేయించాం. ప్రసవం అనంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా బిడ్డతో సహా క్షేమంగా ఇల్లుకు చేర్చారు.

– నారే వాసు, కాకినాడ

క్లుప్తంగా

రేపు డయల్ యువర్ కమిషనర్



కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ నుంచి డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ జగనన్నకు చెబుదాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహణపై శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 91334 43734కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10.30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని అన్నారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాకినాడ రూరల్ ఎంపీడీఓగా స్వప్న



కర్రే స్వప్న

కాకినాడ రూరల్: రూరల్ ఎంపీడీఓగా కర్రే స్వప్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. కరప ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా చూడడంతో పాటు మండల అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానన్నారు. తనకు నియోజకవర్గ పరిధిలో అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ రూరల్ ఏఓగా పనిచేసిన శ్రీనివాసరావు ప్రత్తిపాడు మండల పరిషత్ ఏఓగా బదిలీ అయ్యారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



తైక్వాండో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న పద్మనాభం

నాగమల్లితోట జంక్షన్: స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో రాహుల్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో జరుగుతున్న వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం, గౌరవ అతిథిగా డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ వేసవి శిక్షణలో నేర్చుకున్న మెలకువలతో తైక్వాండోలో రాణించాలన్నారు. డీఎస్ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ వేసవి శిక్షణతో ఆగిపోకుండా నిరంతరం సాధన చేస్తూ తైక్వాండోలో ప్రతిభ చాటాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, సబ్బెళ్ల శివన్నారాయణ రెడ్డి, తైక్వాండో కోచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



దీప్తి సునయనకు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా స్విమ్మింగ్ సంఘ అధ్యక్షుడు సతీష్

నాగమల్లితోట జంక్షన్: విజయవాడలోని సర్‌విజ్జి మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాకినాడ క్రీడాకారిణి పీఎస్ఆర్ఎస్ దీప్తి సునయన ప్రతిభ కనబరిచింది. 400 మీటర్ల అంశంలో పురుషులు, మహిళల వ్యక్తిగత విభాగంలో కాంస్యం పతకం సాధించింది. ఆమెను జిల్లా స్విమ్మింగ్ సంఘ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఐ.రాజు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

దాడులు నివారించాలి

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించి దళితులపై దాడుల నివారణకు కృషి చేయాలని కేవీపీఎస్ కాకినాడ జిల్లా మహాసభ పిలుపునిచ్చింది. శనివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో పలువురు నాయకులు మాట్లాడారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, బచ్చల కామేశ్వరరావు పాల్గొన్నారు.

కాస్మెటిక్ గైనకాలజీ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు

కాకినాడ క్రైం: కాకినాడలో కాస్మెటిక్ గైనకాలజీ సెంటర్ శనివారం ఏర్పాటైంది. ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఏఎల్ సత్యవతి ఆధ్వర్యంలో స్థానిక శ్రీనగర్‌లోని సృజన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం ఈ సెంటర్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ముంబయికి చెందిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ సిజెల్ అజ్మీరా, యురాలజీ, ఆంఢ్రాలజీ నిపుణుడు డాక్టర్ ఎస్‌వీఎస్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కాస్మెటిక్ గైనకాలజీ సెంటర్‌ను నెలకొల్పిన డాక్టర్ సత్యవతి, డాక్టర్ విష్ణువర్ధన్ దంపతులను అభినందించారు. ఐఏవీఏ వ్యవస్థాపకురాలు డాక్టర్ సీజెల్, డాక్టర్ ఎస్‌వీఎస్ రావు మాట్లాడుతూ అధునాతన వైద్య సేవలు అందుబాటులో తెచ్చామన్నారు. ట్రీట్మెంట్ రూమ్‌ని డాక్టర్ సిజెల్, లేజర్ రూమ్‌ను డాక్టర్ ఎస్‌వీఎస్ రావు ప్రారంభించారు. లిటిల్ వుడ్స్ స్కూల్ చైర్మన్ నాగేశ్వరరావు, డాక్టర్లు విష్ణువర్ధన్, సత్యవతి, సాయి అనిరుథ్‌లు ఎమ్మెల్యేను సత్కరించారు. రాష్ట్ర వైద్య విద్యాసంచాలకుడు నరసింహం, డాక్టర్లు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆలయానికి భక్తుల రద్దీ

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయం భూగా పిలిచే శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి రద్దీ నెలకొంది. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గంటల తరబడి క్యూలో వేచిఉండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి శనివారం ఒక్కరోజే సుమారు రూ.3.15 లక్షల ఆదాయం సమకూరింది.

రక్తదానం ఎంతో ఉత్తమం



రక్తదాతలను అభినందిస్తున్న పోర్టు అధికారి శ్రీధర్మశాస్త్ర

బోట్‌క్లబ్: రక్తదానం ఎంతో ఉత్తమమని కాకినాడ పోర్టు అధికారి కె.శ్రీధర్మశాస్త్ర అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో శనివారం రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్, షిప్పింగ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం అందక అనేకమంది చనిపోతున్నారన్నారు. రక్తదానంతో బాధితులను ఆదుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఎంవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు వచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత ఎండాకాలంలో రక్త నిల్వలు లేకపోవడంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఏవీ రంగారావు, టీవీఎస్ రాజు, కేవీఎస్ సీతారాం, వి.నగధర్, వి.దుర్గామహేష్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి

సామర్లకోట: రైల్వేలో ఇక నుంచి ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా, ప్రతి చిన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజయవాడ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.శ్రీకాంత్ అన్నారు. ఒడిశాలో జరిగిన ఘోర ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి రైల్వే స్టేషన్‌లో నిర్వహిస్తున్న భద్రతా సదస్సుల్లో భాగంగా శనివారం సీనియర్ డివిజనల్ సేఫ్టీ అధికారి టి.శ్రీనాథ్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో సదస్సు నిర్వహించారు. ఏడీఆర్ఎం ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రతి రైల్వే కార్మికుడు, ఉద్యోగి ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలన్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారంతో పాటు బుకింగ్ కౌంటర్, ప్రయాణికులు వేచి ఉండే గదులను పరిశీలించారు.



వీకే రాయపురంలో ఓ పొలం వద్ద గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు

సామర్లకోట: ఎండలు మండిస్తున్నాయి.. సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఇది చాలదు అన్నట్లు కొందరు రైతులు తమ పొలాల్లో ఉన్న గడ్డికి నిప్పు పెడుతున్నారు. ఎండల వేడికి తోడు పొలాల్లో మంటలు ఇబ్బంది పెడుతున్నాయి. సమీప నివాసాల ప్రజలు అల్లాడుతున్నారు. శనివారం వీకే రాయపురంలో ఓ పొలంలో ఇలా మంటలు పెట్టారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్య స్పందిస్తూ పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం వల్ల భూసారం కోల్పోతుందని హెచ్చరించారు. వరి యంత్రాలతో కోతలు జరిగిన పొలంలో నీటిని నింపి లోతుగా దుక్కు దున్నుకోవాలని సూచించారు. దీనివల్ల ఎండు గడ్డి నీటిలో కుళ్లి భూసారం పెరుగుతుందన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చెప్పారు. శనివారం ఆయన స్మార్ట్‌సిటీ అధికారులతో కలసి నగరంలో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాలు, అక్కడ చేపట్టాల్సిన సంస్కరణలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్, టౌన్ ప్లానింగ్ విభాగంతో కలసి ఇటీవల నగరంలో విస్తృతంగా పర్యటించి కొన్ని ప్రాంతాలను గుర్తించామన్నారు. కళాశాలలు, పాఠశాలలు ఉండే స్కూల్స్ జోన్స్‌తో పాటు ఇతర రద్దీగా ఉండే 25 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు, ట్రాఫిక్ సిగ్నల్స్, ఇతర ప్రమాద నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. తద్వారా వాహన వేగాన్ని నియంత్రించి ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించాలన్నదే లక్ష్యమన్నారు. ప్రజలు కూడా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని వాహన వేగాన్ని నియంత్రించుకోవాలని సూచించారు. ఆయన వెంట స్మార్ట్‌సిటీ ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పీస్ ఫర్ వాక్ విజయవంతానికి పిలుపు



వివరాలు వెల్లడిస్తున్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి రజనీ

కాకినాడ రూరల్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో కాకినాడలో ఆదివారం ఉదయం పీస్ ఫర్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి రజనీ తెలిపారు. సర్పవరం జంక్షన్ వద్ద బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం జీ20 దేశాల సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న సందర్భంగా కేంద్రం పిలుపునకు అనుగుణంగా పీస్ ఫర్ వాక్ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 6 గంటలకు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. సర్పవరం జంక్షన్ నుంచి వివేకానంద పార్కు వరకూ పాదయాత్ర జరుగుతుందని 15 నుంచి 40 ఏళ్ల మధ్య గల వారు పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో దిల్ రెడ్డి, బ్రహ్మకుమారీస్ గంగ, వాసవి, చంద్ర పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రండి



కంటి వైద్య నిపుణుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: మరణానంతరం నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు శ్రీనివాస్ అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్, లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నేత్రదాన దినోత్సవం జరిగింది. ప్రపంచ జనాభాలో దాదాపు 5 శాతం మంది కేవలం కార్నియా వ్యాధుల కారణంగా అంధులుగా మారుతున్నారన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ ఏ వయస్సు వారైనా నేత్రదానానికి ముందుకు రావొచ్చన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను సత్కరించారు. క్లబ్ సభ్యులు ద్వారంపూడి విపుల్, అసోసియేషన్ సభ్యులు చైతన్య, వెదురుపాక సతీష్, రఘురాం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



వీకే రాయపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వంగా గీత, దొరబాబు

సామర్లకోట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తుందని ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వీకే రాయపురం గ్రామంలో ఎంపీ నిధులు రూ.2.60 లక్షలతో శ్మశాన వాటికలో స్నానాల షెడ్లు, గ్రామంలో రూ.లక్షలతో నిర్మించే డ్రైన్ పనులకు వారు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ, ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఉటా వాసు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాధవపట్నంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జున రావు పాల్గొన్నారు.

నేడు పుస్తక పరిచయ సభ

కాకినాడ కల్చరల్: సాహితీ స్రవంతి కాకినాడ శాఖ ఆధ్వర్యంలో పెనుమాక రత్నాకర్ రచించిన గౌతమీ తీరం కథా సంపుటి పుస్తక పరిచయ సభ ఆదివారం జరుగుతుందని సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకి రామ్‌చౌదరి తెలిపారు. ఈ సభ సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని పెన్షనర్స్ భవన్‌లో జోష్యుల కృష్ణబాబు అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. సభలో డాక్టర్ కాళ్లకూరి శైలజ, ఆర్.రత్నాజయ్ పుస్తక సమీక్ష చేస్తారన్నారు. సాహితీవేత్తలు, అభిమానులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

కరప: వేలంగి గ్రాడ్యుయేట్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం జరిగిన అండర్–19 టోర్నీలో వాకాడ –భావవరం జట్లు తలపడగా వాకాడ విజయం సాధించింది. మాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను మార్రెళ్ల ఆకాష్ (వాకాడ) దక్కించుకున్నారు. నో ఏజ్ లిమిట్ టోర్నీ మొదటి మ్యాచ్‌లో వాకాడ–షీలా తలపడగా వాకాడ టీం విజేతగా నిలిచింది. మాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాయిరఘు (వాకాడ) నిలిచారు. మూడో మ్యాచ్ గురజానపల్లి– దొడ్డంపేటకు మధ్య జరగగా గురజానపల్లి విజయం సాధించింది. మాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జయ (గురజానపల్లి) నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను బెవర శివప్రసాద్, మలింగ అందించారు. శనివారంతో ప్రీ క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి.

గాయపడిన విశ్రాంత హెచ్‌ఎం మృతి



కపిలవాయి కుక్కుటేశ్వరరావు

కరప: కాకినాడ రూరల్, అనపర్తి నియోజకవర్గాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కపిలవాయి కుక్కుటేశ్వరరావు శుక్రవారం రాత్రి మృతి చెందారు. నాలుగు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన గాయపడ్డారు. క్రమేణా ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబీకులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించే లోపే ఆయన మృతి చెందారు. ముక్తేశ్వరం, కైకవోలు, శహపురం, కొమరగిరి, ఏడిద, బిక్కవోలు తదితర పాఠశాలల్లో ఆయన పనిచేశారు.

పరిపాలనపై అవగాహన అవసరం



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పరిపాలనపై జెడ్పీటీసీ సభ్యులు అవగాహన పెంచుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఈటీసీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పరిపాలన విధానంపై అవగాహన ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి వీలుంటుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ, నవరత్నాల పథకాలపై ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఈటీసీ ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు ప్రసాద్, ఎంఎస్ఎన్ రెడ్డి వివరించారు. శిక్షణ ముగించుకున్న జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

చెరువులో చేపల వేట వద్దని వినతి

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందజేస్తున్న చెరువులో చేపల వేట అనుమతిని నిలిపివేయాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ డిమాండ్ చేశారు. రెండు రోజులుగా సామర్లకోట తాగునీటి చెరువులో చేపల వేట సాగుతున్నా మున్సిపల్ అధికారులు మౌనంగా ఉంటున్నారని అన్నారు. దీనిపై శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఇప్పటికే ప్రజలు కలుషిత జలాలతో ఇబ్బంది పడుతుండగా, చేపల వేటతో చెరువులో నీరు మరింత కలుషితం అవుతుందన్నారు.